సాక్షి అనకాపల్లి

శనివారం ၊ 16 ၊ మార్చి ၊ 2024



క్రీడాకారులకు అభినందన

విశాఖ: ఇంటర్ వర్సిటీ వెయిట్ లిఫ్టింగ్‌లో పతకాలు సాధించిన ఏయూ విద్యార్థులు పల్లవి, శ్రీ లక్ష్మిలను వీసీ అభినందించారు.

వర్షసూచన

అనకాపల్లి: రాగల మూడు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని, రెండు రోజులు స్వల్ప వర్ష సూచన ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 19న 1.0, 20న 12 మి.మీ వర్షపాతం నమోదవుతుందని, ఉష్ణోగ్రత గరిష్టంగా 33.2 నమోదవుతుందన్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శని)	సహర్ (ఆది)
అనకాపల్లి	6.10	4.51
నర్సీపట్నం	6.14	4.49

న్యూస్‌రీల్

ఎస్పీ మర్రిపాలెం చెక్‌పోస్టు ఆకస్మిక తనిఖీ



మర్రిపాలెంలోని పోలీస్ చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

సబ్బవరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జాతీయ రహదారిపై బాటజంగాలపాలెం టోల్‌గేట్ సమీపంలో మర్రిపాలెం వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును ఎస్పీ కేవీ మురళీకృష్ణ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24 గంటలూ అప్రమత్తంగా ఉంటూ వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఇటీవల అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్న సిబ్బందిని అభినందించారు. మరింత అప్రమత్తంగా, ఉత్సాహంగా పని చేయాలని సూచించారు. ఆయన వెంట ఎస్ఐ ధనుంజయ్ తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఏడువాక



వెంకట సత్యారావు



సాగి సీతారామరాజు

విశాఖ సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటీలో అనకాపల్లి జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు లభించింది. రాష్ట్ర కార్యదర్శిగా ఏడువాక వెంకట సత్యారావు, రాష్ట్ర అదనపు కార్యదర్శిగా దత్తుడు రాజు రాజా సాగి సీతారామరాజులు నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలను చేపట్టినట్లు శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది.

వలంటీర్ కుటుంబానికి రూ.5 లక్షల సాయం



వలంటీర్ తల్లి ఈశ్వరమ్మకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే గణేష్

మాకవరపాలెం: హత్యకు గురైన వలంటీర్ కుటుంబానికి సీఎం సహాయ నిధి నుంచి రూ.5 లక్షలు మంజూరైంది. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ శుక్రవారం రాత్రి చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. లచ్చన్నపాలెం గ్రామానికి చెందిన వలంటీర్ నడింపల్లి హరి (24) గత నెల 1న హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యే చొరవతో సీఎం సహాయ నిధి నుంచి రూ.5 లక్షల ఆర్థిక సాయం మంజూరైంది. ఈ చెక్కును వలంటీర్ హరి తల్లి ఈశ్వరమ్మకు ఎమ్మెల్యే అందజేశారు. ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

'బండారు' చెంత అసంతృప్తుల చింత..!

- టికెట్ రాకపోవడంతో ఇంకా మౌనముద్రలోనే సత్యనారాయణమూర్తి
- ఉమ్మడి విశాఖలో టికెట్ రాని తెలుగు తమ్ముళ్లంతా బండారు ఇంటికి..
- భవిష్యత్తు కార్యాచరణపై చర్చించిన నేతలు
- చంద్రబాబు వైఖరిపై గుర్రుగా ఉన్న సీనియర్లు
- పార్టీ టికెట్ ఇవ్వకపోవడంపై రగిలిపోతున్న కేడర్



విశాఖ సిటీ: జిల్లా తెలుగుదేశంలో అసంతృప్తి జ్వాలలు రగులుతున్నాయి. అధినేత చంద్రబాబుపై తెలుగు తమ్ముళ్లు కారాలు మిరియాలు నూరుతున్నారు. కష్టకాలంలో పార్టీ కోసం నిలబడిన వారిని పక్కన పెట్టి.. ఆర్థిక పరిపుష్టి ఉన్న వారికే టికెట్లు ఇవ్వడంపై సీనియర్లు తీవ్ర ఆగ్రహావేశాలతో ఉన్నారు. తెలుగుదేశం పార్టీ రెండో జాబితా ప్రకటించిన తరువాత జిల్లా టీడీపీలో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. నిన్న మొన్నటి వరకు అధినేతపై ఈగ వాలనీయని నేతలు జాబితాలో చోటు దక్కకపోవడంతో.. దుమ్మెత్తి పోస్తున్నారు. అసంతృప్తి నేతలంతా ఒక చోట చేరడం ఇపుడు టీడీపీలో హాట్ టాపిక్‌గా మారింది.

బండారుకు బుజ్జగింపులు

పెందుర్తి టికెట్‌ను తెలుగుదేశం పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించింది. ఈ స్థానం నుంచి జనసేన అభ్యర్థిగా పంచకర్ల రమేష్‌బాబు ఎన్నికల బరిలో దిగనున్నారు. దీంతో మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత బండారు సత్యనారాయణమూర్తి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం కష్టపడిన తనను పక్కనపెట్టడంపై జీర్ణించుకోలేకపోతున్నారు. ఇదిలా ఉంటే బండారుకు, జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబుకు గత కొద్ది కాలంగా పొసగడం లేదు. పంచకర్లకు టికెట్ ఇస్తే తాను సహకరించనని గతంలోనే టీడీపీ అధినాయకత్వానికి తేల్చి చెప్పారు. పెందుర్తి టికెట్ కోసం బండారు చివరి నిమిషం వరకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. అయితే ఆ స్థానాన్ని జనసేనకు కేటాయించినప్పటికీ బండారుకు ప్రత్యామ్నాయం చూపించకపోవడంపై రగిలిపోతున్నారు. గురువారం రెండో జాబితా ప్రకటించినప్పటి నుంచి బండారు పరవాడలో ఉన్న తన ఇంటి నుంచి అడుగు బయట పెట్టలేదు. జిల్లా నాయకులు ఫోన్ చేసినప్పటికీ అందుబాటులోకి రాలేదు. దీంతో పల్లా శ్రీనివాసరావు, గణబాబు.. బండారు ఇంటికి వెళ్లి సర్ది చెప్పే ప్రయ త్నం చేసి వెళ్లిపోయారు.

బండారు నివాసానికి అసంతృప్తివాదులు

టికెట్ ఆశించి భంగపడిన టీడీపీ అసంతృప్తివాదులు బండారు నివాసంలో సమావేశమయ్యారు. అనకాపల్లి ఇంచార్జ్ పీలా గోవింద్, చోడవరం ఇంచార్జ్ తాతయ్యబాబు, మాడుగుల టీడీపీ నేత పీవీజీ కుమార్, ఇతర నాయకులు బుధవారం సాయంత్రం బండారు నివాసానికి వెళ్లి తమ భవిష్యత్తు కార్యాచరణపై చర్చించినట్లు సమాచారం. పార్టీ కోసం కష్టపడిన తమను అధినాయకత్వం పట్టించుకోకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. కొంతమంది పార్టీ సీనియర్లతో పాటు చంద్రబాబు కూడా ఫోన్లు చేసి బుజ్జగించే ప్రయత్నాలు చేశారు. జనసేన పార్టీ నేతలతో కలిసి పనిచేయాలని, పార్టీ నిర్ణయించిన, జనసేన నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించినట్లు తెలిసింది. దీనిపై అసంతృప్తి నేతలు మరింత రగిలిపోతున్నారు. పొత్తుల పేరుతో టికెట్లు ఇవ్వకపోగా.. పక్క పార్టీల విజయానికి కష్టపడాలని చెప్పడంపై మండిపడుతున్నారు. వీరిలో కొంత మంది పార్టీ మార్పుపై చర్చించుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఆ ముగ్గురికీ చంద్రబాబు ఝలక్ -8లో

రాత్రింబవళ్లు కష్టపడితే ఇదా ఫలితం?

- అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదు
- పవన్ కల్యాణ్‌పై పరుచూరి చిందులు
- పార్టీ పదవులకు రాజీనామా



రాజీనామా పత్రంతో పరుచూరి భాస్కరరావు

తుమ్మపాల: ఐదేళ్లుగా రాత్రి పగలు కష్టపడ్డాను.. ఇల్లు, వాకిలి, పెళ్లాం పిల్లల్ని వదిలి పార్టీ కోసం తిరిగాను.. పొత్తు పేరిట పార్టీలోకి కొత్తగా వచ్చిన కొణతాలకు టికెట్ ఇచ్చారు.. పవన్ కల్యాణ్ నాకు కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదు.. నా కష్టానికి ఇదా ఫలితం.. అని పరుచూరి భాస్కరరావు తీవ్ర ఆవేదన చెందారు. జనసేన పార్టీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పదవులకు రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు. పట్టణంలో జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీకి సైనికుల్లా పనిచేశామని, విజయవాడలో 16 రోజుల పాటు వేచి ఉన్నా పార్టీ అధినేత పవన్ కల్యాణ్ కనీసం మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదన్నారు. అవమాన పడుతూ పార్టీలో ఉండలేనన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో జనసేనకు దక్కిన నాలుగు సీట్లలో మూడు సీట్లు ఇటీవల వచ్చిన కొత్త వారికి ఇచ్చారని, కానీ ఐదేళ్లుగా కష్టపడిన తమకు మాత్రం కనీసం ఐదు నిమిషాలు మాట్లాడే అవకాశం ఇవ్వలేదన్నారు. పార్టీ కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా చెప్పుకునేందుకు ఎల్లవేళల తామున్నామని, కానీ తమకు కష్టం వస్తే చెప్పుకునేందుకు పార్టీ అధిష్టానంలో ఎవరూ లేరన్నారు. ఇక నుంచి పార్టీకి దూరంగా ఉండనున్నట్లు తెలిపారు.

టీడీపీకి సహకరించం

చోడవరం: చోడవరం ఎమ్మెల్యే టికెట్ తెలుగుదేశం పార్టీకి ఇవ్వడంపై జనసేన కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమన్వయకర్త పీవీఎస్ఎన్‌రాజు అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో శుక్రవారం అత్యవసర సమావేశం జరిగింది. ఐదేళ్లుగా ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ అనేక ఉద్యమాలు చేశామని, తమకు కాకుండా టీడీపీకి ఎలా కేటాయిస్తారని సమావేశంలో తీవ్రంగా చర్చించారు. పవన్ కల్యాణ్ నిర్ణయం మార్చుకోకపోతే టీడీపీ అభ్యర్థికి పనిచేయడానికి జనసేన క్యాడర్ సిద్ధంగా ఉండరని స్పష్టం చేశారు.

అనుచరులతో చర్చించాకే తదుపరి నిర్ణయం

- చంద్రబాబుకు చెప్పిన తాతయ్యబాబు

చోడవరం: అనుచరులతో చర్చించాకే పార్టీలో తన తదుపరి చర్య ఉంటుందని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడికి పార్టీ చోడవరం ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు చెప్పినట్టు తెలిసింది. నాలుగేళ్లుగా పార్టీ అభివృద్ధికి కృషి చేసిన తనను కాదని మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుకి టికెట్ ఇవ్వడంపై అసంతృప్తితో ఉన్న తాతయ్యబాబుకు చంద్రబాబు నుంచి పిలుపు రావడంతో శుక్రవారం ఉండవల్లి వెళ్లి కలిశారు. తన అసంతృప్తి వ్యక్తం చేసి అనుచరులతో మాట్లాడిన తర్వాత తన నిర్ణయం చెబుతానంటూ అక్కడ నుంచి వెనుదిరిగినట్టు సమాచారం.

కట్టుదిట్టంగా టెన్త్ పరీక్షలు

- వెబ్ ఎక్స్ ద్వారా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి సమీక్ష



తుమ్మపాల: జిల్లాలో ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో వెబ్ ఎక్స్ ద్వారా జిల్లా అధికారులతో మాట్లాడారు. జిల్లాలో పదో తరగతి పరీక్షలకు 21,250 మంది హాజరుకానున్నారని, వీరిలో 10,873 మంది బాలురు, బాలికలు 10,386 మంది రెగ్యులర్ విద్యార్థులు, 2,324 మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు చెప్పారు. 108 పరీక్ష కేంద్రాల్లో రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 నిమిషాల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు.

పరీక్ష కేంద్రానికి ఉదయం 8.45 గంటలకే చేరుకోవాలని సూచించారు. ఆలస్యంగా హాజరయ్యే విద్యార్థులకు కేంద్రంలోకి ప్రవేశం లేదన్నారు. ఎన్నికల షెడ్యూల్ నేపథ్యంలో ఈ పరీక్షలను ఎంతో జాగ్రత్తగా నిర్వహించాలని, అధికారులు అప్రమత్తతో ఉండాలని, ఎటువంటి పొరపాట్లు దొర్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని పరీక్ష కేంద్రాలను మరోసారి తనిఖీలు నిర్వహించాలన్నారు. పరీక్ష కేంద్రాలకు మొబైల్ ఫోన్లు, గాడ్జెట్లు, ఎలక్ట్రిక్ పరికరాలు అనుమతించబోమన్నారు. డీఈవో సహా చీఫ్ సూపరింటెండెంట్ ఇతర అధికారులు సైతం సెల్‌ఫోన్లను, పేజర్లు, కాల్కిలేటర్లు వెంట తీసుకురావద్దన్నారు. అక్రమాలకు పాల్పడితే బాధితులపై మూడేళ్ల జైలుశిక్ష పడుతుందని హెచ్చరించారు. అన్ని కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు అత్యవసర వైద్య పరికరాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, బయట వ్యక్తులకు అనుమతి లేదన్నారు. మాస్ కాపీయింగ్‌పై ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆర్టీసీ బస్సులు సకాలంలో నడపాలని, హాల్‌టికెట్లు ఉన్న విద్యార్థులకు ఉచిత ప్రయాణం కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ కేవీ మురళీకృష్ణ, డీఈవో వెంకటలక్ష్మమ్మ, డీఆర్వో దయానిధి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

చరిత్ర తిరగరాసేలా..

- ఎం.అలమండలో రూ.22 కోట్లతో సంక్షేమాభివృద్ధి
- డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు
- ప్రగతి పనుల వివరాలతో ఫైలాన్ ఆవిష్కరణ



ఇంటింటా కుళాయి పనులను ప్రారంభిస్తున్న దృశ్యం



ఎం.అలమండలో సంక్షేమాభివృద్ధి వివరాలతో కూడిన ఫైలాన్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: ఎం.అలమండ చరిత్ర తిరగరాసేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో రూ.22 కోట్లతో సంక్షేమాభివృద్ధి పనులు చేపట్టామని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఈ గ్రామంలో రూ.2.96 కోట్లతో చేపట్టిన ఐదు అభివృద్ధి పనులను పండగ వాతావరణంలో ఆయన శుక్రవారం రాత్రి ప్రారంభించారు. ముందుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో రూ.21.99 కోట్లతో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలతో కూడిన ఫైలాన్‌ను ఆవిష్కరించారు. ఎం.అలమండ నుంచి సిరపరపు వారి కల్లాలు వయా కొత్త చెరువు వరకు రూ.1.38 కోట్లతో చేపట్టనున్న 2.20 కిలోమీటర్ల తారురోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. గవరపేట, గొర్లి వీధిలలో కమ్యూనిటీ భవనాలు, అంతర్గత సీసీ రోడ్లు, రూ.1.28 కోట్లతో నిర్మించిన జలజీవన్ మిషన్ పనులను ప్రారంభించారు. ముందుగా దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, స్థానిక సర్పంచ్, గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దాడి జగన్ పాల్గొన్నారు.

ఎన్నికలకు సన్నద్ధం

- పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు పూర్తి
- జిల్లాలో 1,529 పోలింగ్ కేంద్రాలు, 12,78,625 మంది ఓటర్లు
- 332 సమస్యాత్మక కేంద్రాల గుర్తింపు
- ఎన్నికల విధులకు 10 వేల మంది సిబ్బందికి శిక్షణ
- వీరిలో 9,174 బూత్ సిబ్బంది, 332 మైక్రో అబ్జర్వర్లు
- 494 రూట్, జోనల్, బూత్ లెవెల్, బూత్ హై లెవెల్ అధికారులు
- కొత్తగా 3,500 ఎపిక్ కార్డులు పంపిణీ



అనకాపల్లిలో శుక్రవారం స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ

సాక్షి, అనకాపల్లి: సాధారణ ఎన్నికలకు జిల్లా అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే వివిధ విభాగాల వారీగా సిబ్బందికి విధులు కేటాయించి ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇచ్చింది. ఈవీఎంలను తనిఖీలు చేసి స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచింది. అక్రమంగా మద్యం, నల్లధనం రవాణా కట్టడికి చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. ఎన్నికల సమయంలో ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందగానే కేంద్ర బలగాలను రంగంలోకి దింపింది. ఇవి గ్రామాల్లో మార్చ్‌పాస్ట్ చేస్తున్నాయి. వీటితోపాటు మౌలిక సదుపాయాలతో పోలింగ్ కేంద్రాలు సిద్ధమయ్యాయి. ఎన్నికల నగారా మోగనున్న నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్ శెట్టి 'సాక్షి'తో ముచ్చటించారు. జిల్లాలో ఏవిధంగా ఎన్నికలకు ముందస్తు చర్యలు చేపట్టారన్నది వివరించారు.

ప్రణాళిక యుతంగా ఎన్నికల ఏర్పాట్లు..

జిల్లాలో అన్ని పోలింగ్ కేంద్రాలు, కీలకమైన ఈవీఎంలు, స్ట్రాంగ్ రూంలతోపాటుగా సీల్‌ను, సీసీటీవీ ఫుటేజీలను తనిఖీ చేశాం. పోలింగ్ కేంద్రాల్లో, డిస్ట్రిబ్యూషన్, స్ట్రాంగ్ రూంల వద్ద తాగునీరు, విద్యుత్, మంచినీరు, టాయిలెట్లు, తదితర మౌలిక సౌకర్యాలను ఏర్పాటు చేశాం. అసెంబ్లీ స్థాయి మానిటరింగ్ టీంలు, వీడియో వీవింగ్, వీడియో సర్వైలెన్స్, స్టేటిక్ సర్వైలెన్స్, అసిస్టెంట్ ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్, ఫ్లయింగ్ స్క్వాడ్, ఎంసీసీ టీం, సెక్టార్ అధికారులను నియమించి వారితో సమీక్షించాం. జిల్లాలో ఎన్నికల సిబ్బందికి తగు శిక్షణ ఇచ్చాం. రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేలా మందస్తు చర్యల్లో భాగంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సెక్టోరియల్, పోలీస్ సెక్టోరియల్ అధికారులు, నోడల్ అధికార్లు, ఈఆర్వో, ఏఈఆర్వో, తదితర విభాగాల వారికి ఇప్పటికే శిక్షణ ఇచ్చాం. మరికొంతమంది సిబ్బందికి శిక్షణ అందిస్తున్నాం. ఎన్నికల్లో వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ రికార్డింగ్ ఎప్పటికప్పుడు జరిగేలా ముందస్తు చర్యలు తీసుకున్నాం. జిల్లాకు సరిపడా ఈవీఎంలు ఉన్నాయని.. ప్రభుత్వ ఉద్యోగులు, కేంద్ర సర్వీస్ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తున్నాం. నియోజకవర్గాల వారీగా స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేశాం. అక్కడ నుంచి ఈవీఎంలు ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరవేసేలా ముందస్తు చర్యలు చేపట్టాం.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక ఫోకస్

జిల్లాలో 12,78,625 మంది ఓటర్లు ఉన్నారన్నారు. 1,529 పోలింగ్ కేంద్రాల్లో 332 సమస్యాత్మకమైనవి కాగా, వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. 1,197 సాధారణ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం పది వేల మంది ఎన్నికల సిబ్బంది పాల్గొంటారు. వీరిలో 9,174 బూత్ సిబ్బంది, 332 మైక్రో అబ్జర్వర్లు, 494 రూట్, జోనల్, బూత్ లెవెల్, బూత్ హై లెవెల్ అధికారులు ఉన్నారు. వీరితోపాటు 16 మంది నోడల్ అధికారులు, 24 మంది స్టాటిక్ చెక్‌పోస్టులు ఆఫీసర్లు, 24 మంది ఫ్లెయింగ్ స్క్వాడ్స్ ఆఫీసర్లు, 157 మంది సెక్టార్ అధికారులు(రిజర్వ్), 146 మంది సెక్టార్ పోలీస్ అధికారులు, 8 ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్ టీంలు, 8 కమాండ్ కంట్రోల్ టీంలకు శిక్షణ పూర్తయింది.

కట్టుదిట్టమైన భద్రత చర్యలు..

ఎన్నికల నేపథ్యంలో కేంద్ర బలగాలు జిల్లాకు ఇప్పటికే చేరుకున్నాయి. ఇప్పటికే అనకాపల్లి, చోడవరం పరిసర ప్రాంతాల్లో రూట్ మార్చ్‌లు చేస్తున్నాయి. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో, కొన్ని కీలక కూడలిలోనూ చెక్ పోస్టులు ఏర్పాటు చేశాం. మొత్తం 158 సెక్టార్లుగా విభజించి సెక్టార్ పోలీస్ అధికారులను నియమించాం. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో సారా బట్టీలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. నల్లధనం, అక్రమ మద్యం అరికట్టడానికి చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నాం. నిరంతర సీసీ కెమెరాల నిఘా.. ప్రత్యేక సాయుధ బలగాల పహారా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎటువంటి ఆధారాలు లేకుండా రూ.10 లక్షల మించి నగదు రవాణా చేయకూడదు.

పోలీసు సిబ్బంది శిక్షణ...

ఎస్పీ ఆధ్వర్యంలో ఏఎస్సై, హెడ్ కానిస్టేబుల్, ఏఎస్సై, ఎస్సైల స్థాయి సిబ్బందికి శిక్షణ పూర్తయింది. అత్యాధునిక ఆయుధాల నిర్వహణ, ఉపయోగంతో ఫైరింగ్, డ్రిల్, మార్చ్‌ఫాస్ట్, మాబ్ కంట్రోల్, వీవీఐపీ ఎస్కార్ట్స్, పీఎస్‌వో, బందోబస్తు మొదలుగు అన్ని అంశాలు గురించి పూర్తి అవగాహన కలిగించాం. ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలకు చేర్చి భద్రపరచడం మొదలగు అంశాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తావులేకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశాం. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన మరుక్షణం నుంచి ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు రంగంలోకి దిగుతాయి. జీవీఎంసీ మెయిన్ స్కూల్‌లో సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ ఉండేందుకు వసతి ఏర్పాట్లు చేపట్టాం. బీఎల్వోలుగా వీఆర్వోలు, సచివాలయ సిబ్బందిని నియమించాం. ఓపీవోలుగా సచివాలయాల సిబ్బందిని నియమించాం. ఎన్నికల ప్రక్రియలో పోలింగ్, కౌంటింగ్ అనేవి చాలా ప్రధానమైనవని.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో ఇన్ఫర్మేషన్ ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేశాం. కొత్తగా 3,500 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్న వారికి ఎపిక్ కార్డులు పంపిణీ చేస్తాం.

ఎస్టీ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించడమే లక్ష్యం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న శంకర్ నాయక్

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్ నాయక్ వెల్లడి

అనకాపల్లి: ఎస్టీ వసతిగృహాలకు సొంత భవనాల నిర్మాణమే లక్ష్యంగా ఎస్టీ కమిషన్ పనిచేస్తుందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్ నాయక్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు ప్రైవేటు హోటల్లో ఆయన శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో నాలుగు ఎస్టీ వసతి గృహాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, సొంత భవనాలు సమకూర్చే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం రూ.20 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. జిల్లాలో మాడుగుల, చోడవరం, రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల్లో పర్యటించామని, ఆయా ప్రాంతాల గిరిజన విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించామన్నారు. మాడుగులలో ఇంటర్, పీజీ, డిగ్రీ విద్యనభ్యసించే గిరి విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. రావికమతం మండలం చలిసింగం గ్రామ రహదారి నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. ప్రతి గిరిజన గ్రామంలో శ్మశానవాటిక ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. ఎస్టీ కులస్తులకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి వారి సమస్యల పరిష్కారానికి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో మెడికల్ కళాశాలల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. నాడు–నేడు పనుల ద్వారా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి పర్చడంతో గిరిజన విద్యార్థులు విద్యకు దగ్గరవుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సంఘాల నేతలు టి.పూర్ణారావు, మధుకుమార్, భానుచందర్, వరహాలదొర, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి నాగశిరీష, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి అజయ్‌బాబు పాల్గొన్నారు.

కలెక్టర్‌తో భేటీ

తుమ్మపాల : రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్‌నాయక్ కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ రవి పట్టన్‌శెట్టిని మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో రెండురోజుల పర్యటనలో తన దృష్టికి వచ్చిన సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. అంతకుముందు ఎస్పీ కె.వి.మురళీకృష్ణను కలిసి పలు సమస్యలు వివరించారు. సాంఘిక సంక్షేమశాఖ డీడీ అజయ్‌కుమార్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి నాగశిరిష పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్లంబింగ్ కోర్సులో శిక్షణకు దరఖాస్తులు

మాకవరపాలెం : ప్లంబింగ్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్(నాక్) జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్ శుక్రవారం తెలిపారు. మాకవరపాలెంలో ఉన్న నాక్ శిక్షణ కేంద్రంలో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. 8వ తరగతి చదివి, 15 నుంచి 45 ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. శిక్షణకు అవసరమైన మెటీరియల్ ఉచితంగా అందజేస్తామన్నారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు 7075340910 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

యలమంచిలి రూరల్ : ఎగ్జామ్ ఎలా రాశావ్. నేను బాగానే రాశాను..మరి నువ్ అంటూ పరీక్ష నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు వారు రాసిన ప్రశ్నలు, జవాబులను సరిచూసుకున్నారు. శుక్రవారం ఇంటర్ సెకండియర్ విద్యార్థులు.పరీక్షలు మొదలైన దగ్గర్నుంచి పుస్తకాలతో కుస్తీ పడుతూ చదువు పోరాటం చేస్తున్న విద్యార్థులకు శుక్రవారంతో పరీక్షలు ముగియడంతో అవధులు లేని ఆనందంతో ఇంటి ముఖం పట్టారు. యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల, కొక్కిరాపల్లి అంబేడ్కర్ బాలికల కళాశాలల కేంద్రాల వద్ద పరీక్షలు రాసిన విద్యార్థులు ఒకరికొకరు బైబైలు చెప్పుకుంటూ సెలవుల్లో ఆనందంగా గడపాలని ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వ బీసీ వసతి గృహాలు, రెసిడెన్షియల్ కళాశాలల నుంచి తమ పిల్లల్ని తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకెళ్లారు. విద్యార్థులంతా తమ సహచర విద్యార్థులను ఒకరినొకరు పలకరించుకుంటూ ముందుకు సాగారు. చివరిరోజు శుక్రవారం ద్వితీయ సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు జరిగాయి.

వెన్నుపోటుకే వెన్నుపోటు

ఆ ముగ్గురికీ ఝలక్

వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అని తెలిసి కూడా.. నాయకులుగా మలిచి.. చట్టసభలకు పంపించిన పార్టీని వెన్నుపోటు పొడిచి మరీ.. చంద్రబాబు పంచన చేరారు. తీరా.. వారి అవసరం లేదని అనుకున్న చంద్రబాబు.. కూరలో కరివేపాకులా పక్కన పెట్టేశారు. విజ్ఞత కలిగిన పార్టీకి దూరమై.. విలువల్లేని పార్టీలో చేరి.. ఇప్పుడు వంచనకు గురయ్యామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ముగ్గురు నేతలు వైఎస్సార్‌సీపీని వంచించి.. టీడీపీలో చేరి.. పాపాలు మూటకట్టుకున్నామంటూ అనుచరగణం ఎదుట బోరుమంటున్నారు.

- ఫిరాయింపుదారుల్ని కరివేపాకులా చూసిన చంద్రబాబు
- డబ్బుకు ఆశపడి నాడు విలువలున్న పార్టీని వీడిన ఎమ్మెల్యేలు
- పాడేరు సీటు ఆశించిన గిడ్డి ఈశ్వరికి మొండిచెయ్యి
- రంపచోడవరం టికెట్ కోసం భంగపడ్డ వంతల రాజేశ్వరి
- కిడారి శ్రవణ్‌ని వంచించిన చంద్రబాబు
- రాజకీయ భవిష్యత్తు నాశనం చేశారంటూ వాపోతున్న ఫిరాయింపుదారులు
- తదుపరి కార్యాచరణ కోసం అనుచరులతో మంతనాలు
- చంద్రబాబు ఇంటి ముందే ఆందోళన చేసిన వంతల అనుచరులు



సాక్షి, విశాఖపట్నం : ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కేస్తూ.. గెలిపించిన ప్రజల నమ్మకాన్ని.. ఆదరించిన పార్టీ విశ్వాసాన్ని అమ్ముకున్న ప్రజా ప్రతినిధులు.. ఇప్పుడు బేల చూపులు చూస్తున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని సంతలో పశువుల్లా ఎమ్మెల్యేల్ని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు కొనేశారు. ఒడ్డు దాటే వరకే ఓడ మల్లన్న.. ఆ తర్వాత బోడి మల్లన్న అనే సూత్రాన్ని ప్రతిసారీ తూచ తప్పకుండా పాటించే నాయకుడు చంద్రబాబే అన్న విషయం జగమెరిగిన సత్యం. అది తెలిసి కూడా.. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు తల్లిలా ఆదరించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వదిలేసి.. టీడీపీ కండువా కప్పేసుకున్నారు. ఇప్పుడా టీడీపీ.. టికెట్ ఇవ్వకుండా బలి పశువుల్ని చేయడంతో రోడ్డున పడ్డారు. ఫిరాయింపుదారుల రాజకీయ పరిస్థితి గాల్లో దీపాల్లా మారిపోయాయి.

పాలుపోని ఈశ్వరి..

2014 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసి.. ఎమ్మెల్యేగా విజయం సాధించిన గిడ్డి ఈశ్వరి.. తర్వాత చంద్రబాబు మాయమాటలతో పార్టీ ఫిరాయించేశారు. రూ.5 కోట్ల డీల్ తోపాటు మంత్రి పదవి ఇస్తానని చెప్పి.. చంద్రబాబు పార్టీలోకి ఆహ్వానించడంతో.. అన్నలా ఆదరించిన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కాదని.. నయవంచకుడి పంచన చేరి.. 2018లో పచ్చ కండువా కప్పుకున్నారు. అప్పటి నుంచి గిడ్డికి అన్నీ కష్టాలే ఎదురయ్యాయి. టీడీపీలో సరైన ప్రాధాన్యమివ్వడం తగ్గించేశారు. 2019 టీడీపీ నుంచి కష్టపడి టికెట్ సాధించి పోటీలో నిలిచారు. వైఎస్సార్‌సీపీకి అన్యాయం చేసిన గిడ్డి ఈశ్వరిపై విశ్వాసం కోల్పోయిన ప్రజలు.. ఆమెని ఇంటికే పరిమితం చేశారు. ఇప్పుడు చంద్రబాబు కూడా ఈశ్వరిని పొమ్మనకుండా పొగపెట్టే ప్రయత్నాలు చేస్తూ.. పొత్తుల్లో భాగంగా టికెట్‌ని బీజేపీకి కట్టబెట్టేశారు.

దీంతో.. గిడ్డి పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. తన గోడు వినిపించేందుకు వెళ్దామని అనుకున్నా.. చంద్రబాబు రానివ్వడం లేదని తెలుస్తోంది. దీంతో.. గిడ్డి అనుచరులు మండిపడుతున్నారు. రెబల్‌గా పోటీ చేయాలని పార్టీ శ్రేణులు చెబుతున్నా.. ఏం చెయ్యాలో పాలుపోక నడిసంద్రంలో నిలిచిపోయినట్లు తన పరిస్థితి ఉందని సన్నిహితుల వద్ద వాపోతున్నారు.

నైరాశ్యంలో 'వంతల'..

గిడ్డి, కిడారి బాటలో చంద్రబాబుని నమ్మి మోసపోయిన జాబితాలో వంతల రాజేశ్వరి కూడా చేరారు. రంపచోడవరం నియోజకవర్గం నుంచి 2014లో వైఎస్సార్‌సీపీ తరఫున విజయం సాధించారు. టీడీపీ ఆకర్ష్‌లో భాగంగా.. తాను పార్టీ మారితే రూ.20 కోట్లు ఇస్తామని ఆఫర్ చేశారంటూ 2016 మార్చిలో సంచలన వ్యాఖ్యలను బహిరంగంగా చేసిన వంతల.. ఏడాది కాలంలోనే వైఎస్సార్‌సీపీని వీడి.. డబ్బు ఆశ చూపిన పచ్చ కండువానే కప్పుకున్నారు. చట్టసభలకు పంపించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే చివరి వరకూ నా రాజకీయ ప్రయాణమని చెప్పి.. ప్రలోభాల ఎరలో చిక్కుకొని టీడీపీలోకి జంప్ అయ్యారు. 2019లో టీడీపీ తరఫున పోటీ చేసినా.. ప్రజల నమ్మకాన్ని కోల్పోయిన వంతలని ఇంటిలోనే కూర్చోబెట్టారు. ఆ తర్వాత నియోజకవర్గంలో టీడీపీని బతికించేందుకు వ్యయప్రయాసలతో ఐదేళ్లు పనిచేసినా.. చంద్రబాబు గుర్తించకుండా.. వంతల సేవలకు స్వస్తి చెప్పారు. టికెట్ రాకపోవడంతో రాజేశ్వరి నైరాశ్యంలో కూరుకుపోయారు. పార్టీ కోసం సేవచేసినా.. మిరియాల శిరీషకు టికెట్ రావడంతో చంద్రబాబు తనకు కూడా వెన్నుపోటు పొడిచేశారంటూ సన్నిహితుల వద్ద కన్నీటి పర్యంతమయ్యారు.

ఇప్పుడైనా..సరైన నిర్ణయం తీసుకోకుంటే..

ముగ్గురు ఫిరాయింపుదారులకూ టీడీపీ చెక్ పెట్టింది. వైఎస్సార్‌సీపీకి వెన్నుపోటు పొడిచిన వారందరికీ.. చంద్రబాబు మళ్లీ వెన్నుపోటు పొడిచారంటూ ప్రజలే మాట్లాడుకోవడం విశేషం. రాజకీయాల్లో ఉన్న వారు.. పదవులు కోల్పోయినా.. ఇప్పుడు కాకపోతే మరోసారైనా విజయం దక్కించుకునేందుకు అవకాశం ఉంటుంది. అయితే.. సానుభూతిని.. ప్రజలలో విశ్వాసాన్ని మాత్రం కోల్పోకుండా చూసుకోవాలి. ఈ విషయంలో మాత్రం వైఎస్సార్‌సీపీని కాదని టీడీపీకి వెళ్లిన ఫిరాయింపు ఎమ్మెల్యేలు చంద్రబాబుని నమ్మి పూర్తిగా నష్టపోవడంతో పాటు ప్రజల్లో విశ్వాసాన్ని కూడా కోల్పోయారు. ఈ ఎన్నికల్లో సరైన నిర్ణయాన్ని తీసుకోకపోతే వీరి రాజకీయ భవిష్యత్తుకు చరమగీతం పాడినట్లే అవుతుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

'కిడారి' సీటుకి కిరికిరి..!

రూ.కోట్లు.. మైనింగ్ లైసెన్సుల ఆశ చూపి.. మరో గిరిజన ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావుని సైతం ఫిరాయింపు ఎమ్మెల్యేగా ముద్రవేసేశారు చంద్రబాబు. 2014లో వైఎస్ జగన్ నమ్మి అరకు టికెట్‌ని ఇస్తే.. వైఎస్సార్‌సీపీ దయతో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అయితే.. బాక్సైట్ మైనింగ్ లైసెన్సుల కోసం ఆశపడుతున్నట్లు గ్రహించిన టీడీపీ.. కిడారికి.. అదే ఎర వేసేసింది. రూ.12 కోట్లు.. మైనింగ్ లైసెన్స్ ఇస్తామని లోకేష్ చెప్పడంతో.. జంప్ అయ్యారు. ఈ విషయాలన్నీ.. మావోయిస్టుల ఎదురుగా.. స్వయంగా కిడారి చెప్పినట్లు ప్రత్యక్ష సాక్షులు అప్పట్లో చెప్పడం కలకలం రేపాయి. మావోయిస్టుల చేతిలో కిడారి సర్వేశ్వరరావు హత్యకు గురైన తర్వాత.. ఆయన కుమారుడు కిడారి శ్రావణ్ కుమార్‌ని ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీగా కనీసం అవకాశం ఇవ్వకుండానే ఆగమేఘాలపై చంద్రబాబు తన మంత్రి వర్గంలోకి తీసుకున్నారు.

సరిగ్గా ఆరు నెలల తర్వాత లోకేష్ కోసం మంత్రి పదవుల సర్దుబాటులో భాగంగా కిడారి శ్రావణ్‌తో మంత్రి పదవికి చంద్రబాబు రాజీనామా చేయించేశారు. ఆ తర్వాత 2019లో టీడీపీ తరఫున పోటీ చేసినా.. పరాజయం పాలయ్యారు. అప్పటి నుంచి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా, పార్లమెంటరీ పార్టీ ఇన్‌చార్జ్‌గా ఐదేళ్లుగా టీడీపీని అరకులో నిలబెట్టారు. అలాంటి కిడారిని కూడా కరివేపాకులా తీసిపారేయడంతో ఈ యువనాయకుడికి దిక్కుతోచని పరిస్థితి. అధినేతతో మాట్లాడేందుకు కూడా అవకాశం ఇవ్వకపోవడంతో భవిష్యత్తు కార్యాచరణపై అనుచరులతో సంప్రదింపులు జరుపుతున్నారు.

దేవరాపల్లిలో రూ.72 లక్షలతో పార్కు నిర్మాణం

- పార్కులో లైబ్రరీ, యోగా, వాకింగ్ ట్రాక్ సదుపాయాలు
- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు
- వీఎంఆర్‌డీఏ చైర్మన్‌తో కలిసి భూమి పూజ

దేవరాపల్లి : దేవరాపల్లిలో ఆహ్లాదకర వాతావరణంలో అధునాతన హంగులతో సువిశాల పార్కు నిర్మాణం చేపడుతున్నామని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఈ మేరకు నూతన ఎంపీడీవో కార్యాలయం ఎదుట వీఎంఆర్డీఏ నిధులు రూ.72 లక్షలతో చేపడుతున్న పార్కు నిర్మాణ పనులను వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళితో కలిసి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు శుక్రవారం శంకుస్థాపన చేశారు. భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఈ పార్కులో లైబ్రరీ, యోగా గదుల నిర్మాణంతో పాటు నడక దారి సదుపాయాలను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ పార్కు నిర్మాణం పూర్తయితే ఆహ్లాదకరం వాతావరణంతో దేవరాపల్లికి తలమానికంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం, జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, వీఎంఆర్డీఏ ప్రధాన ఇంజినీర్ భవానీ శంకర్, కార్యనిర్వాహక ఇంజినీర్ జె.పి.సింగ్, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లు రవి శంకర్, రమణారావు, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డా. వరదపురెడ్డి సింహాచలంనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరదపురెడ్డి లలితానాయుడు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గొర్రుపోటు రమాదేవి, స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, జె.సి.ఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, గండిపడాల అప్పలరాజు, ఎంపీడీవో సిహెచ్.సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



దేవరాపల్లిలో పార్కు నిర్మాణ పనులకు భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, వీఎంఆర్డీఏ చైర్మన్ చంద్రమౌళి

సాక్షి అసిస్టెంట్ చీఫ్ రిపోర్టర్ కోటేశ్వరరావుకు అవార్డు



అవార్డు అందుకుంటున్న సాక్షి అసిస్టెంట్ చీఫ్ రిపోర్టర్ బొల్లం కోటేశ్వరరావు

విశాఖ సిటీ: వాతావరణ మార్పులపై రాసిన పలు విశ్లేషణాత్మక కథనాలకు 'సాక్షి' అసిస్టెంట్ చీఫ్ రిపోర్టర్ బొల్లం కోటేశ్వరరావుకు రాష్ట్ర స్థాయి ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది. అమెరికా కాన్సులేట్ జనరల్ వాతావరణ మార్పులపై చోటుచేసుకునే పరిణామాలపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని జర్నలిస్టులకు ఒడిశాకు చెందిన వ్యాస్ అనే స్వచ్ఛంద సంస్థతో కలిసి అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. ఏడాది నుంచి వీటిని వివిధ రాష్ట్రాల్లో చేపడుతోంది. ఈ మూడు రాష్ట్రాల్లో వాతావరణ మార్పులపై కథనాలు రాసిన జర్నలిస్టులను ఎంపిక చేశారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా విభాగాల్లో ఒక్కొక్కరిని గుర్తించారు. ఇందులో ప్రింట్ మీడియా విభాగం నుంచి విశాఖపట్నం యూనిట్‌లో 'సాక్షి' అసిస్టెంట్ చీఫ్ రిపోర్టర్ బొల్లం కోటేశ్వరరావును క్లైమేట్ చేంజ్ రిపోర్టింగ్‌లో రాష్ట్ర స్థాయి ఉత్తమ జర్నలిస్టు ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపిక చేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో అమెరికన్ కాన్సులేట్ పబ్లిక్ అఫైర్స్ అధికారి అలెగ్జాండర్ మెక్ లారెన్స్ చేతుల మీదుగా కోటేశ్వరరావు ఈ అవార్డును అందుకున్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 9 అర్జీలు



మహిళా కానిస్టేబుల్ సమస్య వింటున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ గ్రీవెన్స్‌కు వివిధ సమస్యలపై తొమ్మిది అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా తొమ్మిది మంది పోలీసు సిబ్బంది విచ్చేసి తమ అనారోగ్య, ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలను ఎస్పీ కె.వి.మురళీకృష్ణకు వివరించారు. వారి అర్జీలను పరిశీలించి, సానుకూలంగా స్పందించారు. వీటిని తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

నర్సీపట్నం : కుటుంబ సభ్యుల నుంచి రక్షణ కల్పించాలంటూ ప్రేమ జంట నర్సీపట్నం టౌన్ పోలీసులను శుక్రవారం ఆశ్రయించారు. బాధితులు కథనం ప్రకారం.. విశాఖపట్నం కంచరపాలెం, కాకానినగర్‌కు చెందిన పి.చంద్రశేఖర్, నిధి కీర్తిన ప్రేమించుకున్నారు. అమ్మాయి కుటుంబ సభ్యులు వివాహానికి ఒప్పుకోకపోవడంతో ఇద్దరూ ఇంటి నుండి వెళ్లిపోయి సింహాచలం దేవస్థానంలో వివాహం చేసుకున్నారు. ప్రేమ జంట గురువారం నర్సీపట్నం వచ్చి ఓ లాడ్జిలో తలదాచుకున్నారు. ఆ రాత్రి కొంత మంది వ్యక్తులు ప్రేమ జంట ఉంటున్న రూమ్‌లోకి ప్రవేశించి వీరంగం సృష్టించారు. దీంతో ప్రేమ జంట టౌన్ పోలీసులను ఆశ్రయించారు. అమ్మాయి తండ్రి కంచరపాలెం పోలీసుస్టేషన్‌లో కిడ్నాప్ కేసు పెట్టడంతో సీఐ కాంతి కుమార్ ప్రేమ జంటకు ఎస్కార్ట్ ఇచ్చి కంచరపాలెం స్టేషన్‌కు పంపించారు.

ఆలయాల పునర్నిర్మాణానికి రూ.20 లక్షలు విరాళం

యలమంచిలి రూరల్ : పట్టణంలోని పురాతన వేణుగోపాలస్వామి, వీరభద్రస్వామి ఆలయాల పునర్నిర్మాణానికి సీజీఎఫ్ ఫండ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ ఎంప్లాయీస్ ఎడ్యుకేషన్ హెల్త్ అండ్ మెడికల్ వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా విశాఖ డెయిరీ చైర్మన్, విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ రూ.20 లక్షలు విరాళం అందజేశారు. ఒక్కో ఆలయానికి రూ.10లక్షలు చొప్పున ఆలయాల పునర్నిర్మాణానికి ఈ మొత్తం అందజేశారు. డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి సూచనల మేరకు మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు కోరిబిల్లి లక్ష్మి, కొక్కిరాపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు మళ్ల కొండబాబు ఆలయ కమిటీల ప్రతినిధులకు శుక్రవారం ఈ మొత్తాన్ని అందజేశారు. అనంతరం ఆలయ పునర్నిర్మాణ పనులకు సంబంధించి భూమి పూజలు చేశారు. ఎంతో ప్రాచీన చరిత్ర కలిగిన ఈ రెండు ఆలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటి పునర్నిర్మాణ పనులకు అవసరమైన నిధులు సమకూర్చడానికి కృషి చేసిన ఆడారి ఆనంద్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ పిళ్లా రమాకుమారిలకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.



వీరభద్రస్వామి ఆలయం పునర్నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న వార్డు కౌన్సిలర్లు

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన టీడీపీ నేతలతో బూడి

చీడికాడ : మండలంలోని దిబ్బపాలెంలో రెండు టీడీపీకి చెందిన కుటుంబాల పెద్దలు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సమక్షంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి బూడి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. నూతనంగా పార్టీలో చేరికపై బూడి హర్షం వ్యక్తం చేశారు. పార్టీపై, నాయకత్వంపై నిబద్ధతతో ఉండే ప్రతి కార్యకర్తకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటూ శక్తి వంచన లేకుండా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు పార్టీలో చేరిన టీడీపీ నేతలు మాజీ ఉపసర్పంచ్ దారపు అచ్చింనాయుడు, ఆయన కుమారుడు మాజీ వార్డు మెంబర్ దారపు వెంకటరమణ కుటుంబంతో సహా పార్టీలో చేరారు. వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో డిప్యూటీ సీఎం బూడి చేపట్టిన అభివృద్ధి, నాయకత్వంపై ఎనలేని నమ్మకం ఉందన్నారు.

సారా బట్టీలపై దాడులు... ఇద్దరు అరెస్టు



సారా బట్టీ వద్ద డ్రమ్ములను స్వాధీనం చేసుకున్న ఎస్ఈబీ పోలీసులు

పాయకరావుపేట : మండలంలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్స్ దాడులు నిర్వహించిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) పోలీసులు 3000 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేసి, 30 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్టు సెబ్ సీఐ ఎస్.ధర్మారావు తెలిపారు. అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శైలజ రాణి ఆధ్వర్యంలో పాయకరావుపేట సబ్‌స్టేషన్ పరిధిలో ఈ దాడులు జరిపి 4 కేసుల్లో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్టు తెలిపారు. పాతపేట గ్రామ సమీపంలో ఓ వ్యక్తి వద్ద 10 లీటర్లు, అరట్లకోట గ్రామ సమీపంలో ఒక వ్యక్తి వద్ద 20 లీటర్లు సారా పట్టుబడిందని, ధారకొండ ప్రాంతంలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 3వేల లీటర్ల బెల్లం పులుపును గుర్తించి ధ్వంసం చేయడం జరిగిందన్నారు. దాడుల్లో అనకాపల్లి ఏఈఎస్ డి.శైలజరాణితో పాటు డీటీఎఫ్ ఎన్‌స్పెక్టర్ షేక్ మీరా సాహెబ్, పాయకరావుపేట సబ్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.ధర్మారావు, సబ్‌స్టేషన్ ఎస్ఐ పి.జాన్‌ప్రసాద్, అనకాపల్లి సబ్ డీటీఎఫ్ ఎస్ఐ పి.శాంతిలక్ష్మి, యలమంచిలి సబ్‌స్టేషన్ ఎస్ఐ ఎ.శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

చీడికాడ : మండలంలోని చీడిపల్లి గ్రామ శివారు ప్రాంతాల్లో నాటుసారా తయారీ కోసం నిల్వ ఉంచిన బెల్లం ఊటలను గుర్తించి ధ్వంసం చేసినట్టు ఎస్ఐ నారాయణరావు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం అందిన సమాచారం మేరకు గ్రామ శివార్లలో సిబ్బందితో తనిఖీలు నిర్వహించగా నాటుసారా తయారీకి ఉపయోగించే ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన బెల్లం ఊటలు, నాటుసారా తయారి సామాగ్రిని గుర్తించి ధ్వంసం చేశామన్నారు.

రావికమతం : గుమ్మాళ్లపాడు గ్రామంలో సారా తయారీ చేసేందుకు సిద్ధంగా ఉన్న 3,400 లీటర్ల పులుపును ధ్వంసం చేశామని రావికమతం ఎస్ఐ ధనంజయ్ శుక్రవారం తెలిపారు. ఆయన కథనం మేరకు ఆ గ్రామంలో సారా విక్రయాలు జరుగుతున్నట్టు తమకు ముందస్తు సమాచారం అందడంతో సిబ్బందితో పాటు దాడులు చేశామన్నారు. గ్రామ శివారు పొలాల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 3,400 లీటర్ల పులుపును ధ్వంసం చేశామన్నారు.

కె.కోటపాడు : గవరపాలెం గ్రామ శివార్లలో సారా తయారీ కేంద్రాలపై ఎ.కోడూరు పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ముందస్తు సమాచారంతో ఎ.కోడూరు ఎస్ఐ జె.రమేష్ సిబ్బందితో దాడులు జరిపి సారా డ్రమ్ములు, పాత్రలలో నిల్వ ఉంచిన 400 లీటర్ల బెల్లం పులుపును గుర్తించి ధ్వంసం చేశారు.వంటపాత్రలు స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో సిబ్బంది శ్రీను, సింహాచలంనాయుడు, రమేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం



సత్యవతి (ఫైల్)

మాడుగుల రూరల్ : రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా, భర్త తీవ్రంగా గాయపడిన సంఘటన కేజేపురం జంక్షన్‌లో చోటు చేసుకుంది. ఎం.కోటపాడు గ్రామానికి చెందిన గొలుగొండ ఈశ్వరరావు, అతని భార్య సత్యవతితో కలిసి గురువారం గాజువాకలో బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లారు. తిరిగి శుక్రవారం ఉదయం గాజువాక నుంచి స్కూటీ మీద ఎం. కోటపాడు తిరిగి వస్తుండగా కె.జె.పురం జంక్షన్ వద్ద వెనుక నుంచి వస్తున్న సిమెంటు లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ వెనుక చక్రం సత్యవతి మీద నుంచి వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. భర్త ఈశ్వరావుకు కాలు చెయ్యి విరిగిపోయింది. స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. లారీ డ్రైవరు సింహచలంను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేశారు.మృతదేహానికి పంచనామా నిర్వహించి బంధువులకు అప్పగించారు.



క్లుప్తంగా

మైదానంలో బోరు ఏర్పాటుకు చర్యలు


బోరు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మందపాటి సునీత

అనకాపల్లి : ఎన్టీఆర్ క్రీడా మైదానంలో తాగు నీటి సౌకర్యం, మౌలిక సదుపాయాలు కల్పించనునట్లు 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత అన్నారు. క్రీడా మైదానంలో శుక్రవారం తాగునీటి బోరు పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ. 2 లక్షల ఎంపీ నిధులతో క్రీడాకారుల సౌలభ్యం కోసం మంచి నీటి సదుపాయానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఉదయం, సాయంత్రం నిత్యం వేలాది మంది వాకర్లు మైదానంలో వాకింగ్ చేస్తారని ఆమె తెలిపారు. త్వరలో జీవీఎంసీ నిధులతో స్టేడియం చుట్టూ తాగునీటి పైప్ లైన్లు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పార్టీ నేతలు కాండ్రేగుల యశ్వంత్, జీవీఎంసీ నీటిపారుదల శాఖ అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

20న శ్రీనివాస కల్యాణోత్సవం

అనకాపల్లి : స్థానిక దేవునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ సకలా రాజ్యలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20వ తేదీ రాత్రి 8 గంటలకు అలమేలు మంగా సమేత శ్రీనివాసుని కల్యాణోత్సవం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. భక్తులందరూ పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆమె కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అనకాపల్లి : మండలంలో బొజ్జన్నకొండ ఏలేరు కాలువ వద్ద పురుగు మందు తాగిన కర్రి రామకృష్ణ స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పట్టణ పోలీస్‌లకు ఫిర్యాదు అందింది. ఎస్‌ఐ సత్యనారాయణ కథనం మేరకు స్థానిక తుమ్మపాల గ్రామానికి చెందిన కర్రి రామకృష్ణ (32) అచ్యుతాపురం ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారని తెలిపారు. ఇటీవల విధులకు సరిగ్గా వెళ్లకపోవడంతో రామకృష్ణ తండ్రి ఉమామహేశ్వరరావు గురువారం మందలించడంతో రామకృష్ణ పురుగు మందు తాగినట్లు తెలిపారు. అతన్ని కొందరు స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారన్నారు. ఈ మేరకు మృతుడి అన్నయ్య రాఘవేంద్రరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 5,009 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,730	4,400
మొదటి రకం	3,490	4,320
రెండో రకం	3,430	3,750
మూడో రకం	3,260	3,450

అనకాపల్లి సినిమాలు

ఈగల్	: రాజా
గామి	: సత్యనారాయణస్క్రీన్-1
ప్రేమలు	: సత్యనారాయణస్క్రీన్-2
షరతులు వర్తిస్తాయి (మూడు ఆటలు)	
లంబసింగి (మధ్యాహ్నం)	: షిర్డిసాయి
రజాకర్	: పర్తిసాయి
వెయ్‌దరువెయ్	: వెంకటేశ్వర
రికార్డుబ్రేక్	: శ్రీసత్య
భీమా	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 62 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-11 యూనిట్లు, బీ పాజిటివ్-36 యూనిట్లు, ఓ పాజిటివ్-12 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 434 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 358 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.


సిద్ధమైన ఏఎస్‌పేట సచివాలయ భవనం

ఇది కదా అభివృద్ధి

అభివృద్ధి, సంక్షేమం **రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి** మారుమూల గ్రామాలను కూడా అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. పాఠశాలలు, సచివాలయ భవనాలు, వెల్‌నెస్ సెంటర్లు, ఇంటింటి కుళాయిల నిర్మాణంతో పేదలు కోరుకునే మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. దీంతో గతంలో ఎన్నడూ చూడని అభివృద్ధిని ఇప్పుడే చూస్తున్నామని.. **సీఎం జగన్ పాలన స్వర్ణయుగమని ప్రజలు వేనోళ్ల కొనియాడుతున్నారు.**

ప్రగతి పరవళ్లు

ఏఎస్‌పేటలో గతంలో ఎన్నడూ చూడనంత అభివృద్ధి

సచివాలయ భవనం.. వెల్‌నెస్ సెంటర్, రైతుభరోసా కేంద్రం ఏర్పాటు

హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు


నాడు-నేడులో అందంగా రూపుదిద్దుకున్న నరసాపురం ప్రాథమిక పాఠశాల

కశింకోట : మండలంలోని అమీన్ సాహెబ్‌పేట (ఏఎస్‌పేట) సచివాలయ పరిధిలో గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి జరిగింది. రూ.3.85 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేశారు. మండలంలోని మారుమూలన అమీన్‌సాహెబ్ పేట సచివాలయం ఉంది. శివారుగా నరసాపురం, గొబ్బూరు గ్రామాలు, పల్లపు సోమవరం పంచాయతీ దీని పరిధిలో ఉన్నాయి. సుమారు 3 వేల జనాభా కలిగి ఉంది. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసినప్పుడు ఇక్కడ కూడా సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి అభివృద్ధి కార్యక్రమాలు ముమ్మరంగా జరిగాయి. రూ.40 లక్షలతో అసంపూర్తిగా ఉన్న పంచాయతీ కార్యాలయం పూర్తి చేయడంతో పాటు సచివాలయానికి భవనాన్ని నిర్మించి ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. అలాగే రూ.20.80 లక్షలతో వెల్‌నెస్ సెంటర్ భవనాన్ని నిర్మించారు. రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రానికి భవనాన్ని నిర్మించి సిద్ధం చేశారు. నాడు-నేడులో ప్రాథమిక పాఠశాలను రూ.18 లక్షలతో అందంగా తీర్చిదిద్దారు. తరగతి గదులకు మార్గాలు, 4 మరుగుదొడ్ల నిర్మాణం, అందంగా భవనాలకు రంగులు వేసి చూడముచ్చటగా తీర్చిదిద్దారు. చుట్టూ మొక్కలు నాటి పచ్చని వాతావరణం కల్పించారు. వైఎస్సార్ కళా వేదిక కూడా నిర్మించారు. అలాగే సోమవరం గ్రామంలోని పాఠశాలను కూడా రూ.18 లక్షలతో అందంగా అభివృద్ధి చేశారు. రెండో విడత నాడు-నేడులో ఏఎస్‌పేట హైస్కూలును రూ.కోటి 27 లక్షలతో అభివృద్ధి చేస్తున్నారు. పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఆరు అదనపు తరగతి గదుల నిర్మాణంతో పాటు పాఠశాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రూ.20 లక్షలతో కాలువలు, ఏఎస్ పేట, గొబ్బూరుపాలెంలో రూ.20 లక్షలతో అంతర్గత సిమెంట్ రోడ్లు నిర్మించారు. కొత్తగా రూ.40 లక్షలతో ఏఎస్‌పేట పరిధిలోని గ్రామాలకు సుమారు వెయ్యి ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేసే పని ప్రారంభించారు. ఇప్పటికే పలు ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. ఎస్సీ కాలనీ, నర్సాపురంలో చెరో రూ. 5 లక్షలతో సామాజిక భవనాలు నిర్మించారు. ఏఎస్‌పేటలో రూ.10 లక్షలతో సామాజిక భవనం నిర్మిస్తున్నారు. మరో రూ.20 లక్షలతో వెల్‌నెస్ సెంటర్, అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రహరీ నిర్మించారు. ఏఎస్‌పేట నుంచి సోమవరం వెళ్లే మార్గంలో రూ.20 లక్షలతో కల్వర్టు నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. ఇంకా పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇలా కోట్లాది రూపాయలతో మారుమూల ఉన్న గ్రామంలో అభివృద్ధి చేయడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.


ఇంటింటి కుళాయి పనుల నిర్వహణ


ప్రారంభానికి సిద్ధమైన రైతు భరోసా కేంద్రం

ఏఎస్‌పేటలో పలు అభివృద్ధి పనులకు కేటాయించిన నిధులు

రూ.40 లక్షలతో సచివాలయం, పంచాయతీ భవనాల నిర్మాణం	రూ.20.80 లక్షలతో వెల్‌నెస్ సెంటర్ భవన నిర్మాణం
రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్ర భవన నిర్మాణం	రూ.18 లక్షలతో నాడు-నేడులో ప్రాథమిక పాఠశాల అభివృద్ధి
రూ. 40 లక్షలతో సిమెంట్ కాలువలు, రోడ్ల నిర్మాణం	రూ. 20 లక్షలతో 3 సామాజిక భవనాల నిర్మాణం
రూ.కోటి 27 లక్షలతో రెండో విడత నాడు-నేడులో జరుగుతున్న హైస్కూలు అభివృద్ధి పనులు	రూ.40 లక్షలతో ఇంటింటి కుళాయిల ఏర్పాటు


సిద్ధమైన వెల్‌నెస్ సెంటర్ భవనం

అవినీతి తగ్గింది..



సచివాలయ వ్యవస్థ ఏర్పాటు వల్ల అవినీతి తగ్గింది. కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం కశింకోట మండల కార్యాలయం చుట్టూ తిరిగే పని తప్పింది. భూముల రీ-సర్వే వల్ల భూ సమస్యలు పరిష్కారం కావడానికి అవకాశం ఏర్పడింది. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు ద్వారా ఇటువంటి సేవలందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– కె. నానాజీ, పల్లపు సోమవరం గ్రామం

స్కూలును అందంగా తీర్చిదిద్దారు..



నరసాపురం ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి నుంచి చదువుతున్నాను. ఇప్పుడు 5వ తరగతి. మా స్కూల్లో టాయిలెట్లు ఉండేవి కాదు. దీంతో ఇబ్బంది పడేవారం. నాడు-నేడులో టాయిలెట్ సదుపాయం కల్పించి స్కూలును అందంగా తీర్చిదిద్దారు. స్కూలును అభివృద్ధి చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– రాజాన నిహారిక, విద్యార్థి, నరసాపురం ప్రాథమిక పాఠశాల

గతంలో ఇంత అభివృద్ధి చూడలేదు..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో గత ఐదేళ్లుగా ఏఎస్ పేట ఎంతగానో అభివృద్ధి చెందింది. గతంలో ఇంత అభివృద్ధి చూడలేదు. సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రానికి భవనాలు నిర్మించారు. రోడ్లు, కాలువలు నిర్మించి స్కూళ్లను అభివృద్ధి చేశారు. ఇంటింటి కుళాయిలు ఇస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– మలసాల సన్యాసినాయుడు, ఏఎస్ పేట

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక


పార్టీలో చేరిన టీడీపీ శ్రేణులతో భరత్‌కుమార్

అనకాపల్లి : బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సకాలంలో సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కిందని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. అనకాపల్లి మండలం వేటజంగాలపాలెం గ్రామానికి చెందిన టీడీపీ వార్డు మెంబర్ ఉగ్గిన అప్పారావుతో 20 మంది నాయకులు కశింకోట మండలం ఏఎస్‌పేటలోని భరత్‌కుమార్ స్వగృహంలో శుక్రవారం పార్టీలో చేరారు. వీరికి సమన్వయకర్త కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామాల్లో చేసిన అభివృద్ధిని చూసి అనకాపల్లి, కశింకోట మండలాల్లో టీడీపీ శ్రేణులు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. మరో నాలుగైదు రోజుల్లో టీడీపీ, జనసేన నేతలు పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. టీడీపీ నాయకులు సాలాపు శంకర్ శ్రీను, బొండా నాయుడు, బొండా దేముడు, నారిపిన్ని శ్రీను, నందికొల్లు జానుతో పాటు 15 మందికి భరత్‌కుమార్ పార్టీ కండువా వేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ కరక సోమునాయుడు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యకు దరఖాస్తులు

అనకాపల్లి: జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాల కోసం పేద విద్యార్థులు ఈ నెల 23వ తేదీలోగా ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం -2009 ప్రకారం 25 శాతం కోటాలో అనాథులు, దివ్యాంగులు, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు చెందిన పిల్లలకు ఒకటో తరగతిలో సీట్లు కేటాయిస్తామన్నారు. జిల్లాలో మొత్తం 314 ప్రైవేటు పాఠశాలల్లో ఈ అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ నెల 25వ తేదీ లోపు గ్రామ/వార్డు సచివాలయాల్లోగాని, ఇంటర్నెట్ సెంటర్లలోగాని, మీ సేవాలోగానీ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

అవగాహనతోనే క్షయవ్యాధి నిర్మూలన


క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

తుమ్మపాల : క్షయ వ్యాధి నివారణకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని, ఉచితంగా నిర్ధారణ పరీక్షలు చేసి చికిత్స అందిస్తుందని వైద్యులు ఎంఎస్‌వీ బాలాజీ అన్నారు. మండలంలో కొత్తూరు ఏఎంఏఎల్ హైస్కూల్లో టీబీ వారోత్సవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ (టీబీ) వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. వయసు, లింగ, పేద, ధనిక వంటి భేదాలు లేకుండా క్షయ వ్యాధి ప్రతి ఏటా కొన్ని లక్షల మంది ప్రజలకు సోకుతుందన్నారు. ప్రపంచ దేశాలతో పోలిస్తే మన దేశంలోనే క్షయ అధికంగా ఉందన్నారు. గాలి తుంపర్ల ద్వారా ఒకరి నుండి మరొకరికి వ్యాప్తి చెందుతుందన్నారు. క్షయ వ్యాధి ఊపిరితిత్తులతో పాటు ఇతర అవయవాలకు సోకే అవకాశం ఉందన్నారు. చికిత్సకు కనీసం 6 నెలల పాటు మందులు వాడాలన్నారు. హెచ్ఎం కోరిబిల్లి లావణ్య, డీపీసీ అయ్యప్పరెడ్డి, ఎల్లాజీ, పీపీఎం కోఆర్డినేటర్ ఎం.పెంటయ్య, ఎస్‌టీఎస్ పద్మజ, ఎస్‌టీఎల్ఎస్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రూ. 26 వేలు వేతనం చెల్లించాలని ధర్నా

అనకాపల్లి : పంచాయతీ పారిశుధ్య కార్మికులకు రూ. 26 వేలు వేతనం చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వై.ఎస్.భద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలం కొత్తూరు మేజర్ పంచాయతీ కార్యాలయం ముందు శుక్రవారం ధర్నా చేపట్టారు. పంచాయతీలో పారిశుధ్య పనులకు టెండర్ నిర్వహిస్తామని కార్యదర్శి ప్రకటన ఇచ్చి కార్మికులు టెండర్‌కు హాజరైతే కార్యాలయానికి వచ్చిన నాయకులతో లాలూచీ పడి సెలవుపై వెళ్లిపోవడం అన్యాయమన్నారు. సాధారణ ఎన్నికల కోడ్ వస్తున్న నేపథ్యంలో టెండర్ వాయిదా వేయడం, టెండర్ వేయకుండా అడ్డుకున్న కార్మికుల చేత వెట్టి చాకిరీ చేయించాలని పాలకవర్గం, కార్యదర్శి కుట్ర పనుతున్నారని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, సబ్బులు, నూనెలు, తువ్వాళ్లు ఇతర పనిముట్లు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఇటువంటి చర్యలు పునరావతం కాకుండా చూడాలని లేకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు కలిగొట్ల నాయుడు, నాగేశ్వరరావు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేరేలా.. పట్టాల పంపిణీ


తాళ్లపాలెంలో రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి


1,2 సచివాలయాల లబ్ధిదారులకు పట్టాలందజేస్తున్న భరత్‌కుమార్, సునీత, ప్రసాద్

కశింకోట : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని ఎంపీపీ కలగా లక్ష్మి అన్నారు. మండలంలోని తాళ్లపాలెంలో 88 మంది లబ్ధిదారులకు వైఎస్సార్ జగనన్న ఇళ్ల కాలనీలో ఇచ్చిన ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ బాండ్లను పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్సార్ జగనన్న లే అవుట్లు ఏర్పాటు చేసి అర్హులకు పారదర్శకంగా లక్షలాది రూపాయల విలువైన ఇళ్ల స్థలాలు, ఇళ్లకు ఆర్థిక సహాయం అందించారన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి, వైఎస్సార్‌సీపీ విజయం సాధించడానికి అంతా కృషి చేయాలన్నారు. మండల వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవానీ, లగిశెట్టి గణేష్, ఇందలి ముసిలినాయుడు, చిన్ని జనార్దన్, గుమ్మడి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

1,2 సచివాలయాల పరిధిలో..

అనకాపల్లి : రానున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని టీడీపీ, జనసేవ, బీజేపీ పార్టీలు హామీల వర్షం కురిపిస్తాయని, ఓటు వేసే ముందు అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి వేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. స్థానిక 82వ వార్డు కార్పొరేటర్ పరిధి శ్రీరామ్‌నగర్ మాధవ సదన్ హాల్లో 1, 2 సచివాలయాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను కార్పొరేటర్ మందపాటి జానకీరామరాజు, నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్‌తో కలిసి పంపిణీ చేశారు. అర్హులే కొలమానంగా పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కిందన్నారు. కార్పొరేటర్ మందపాటి సునీత మాట్లాడుతూ పేదవాడి సొంతింటి కల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే నెరవేరిందన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ మాట్లాడుతూ జగనన్న గృహాల లబ్ధిదారులకు ఇచ్చిన పట్టాలు సర్వహక్కులు లభించేలా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిన ఘనత ప్రభుత్వానికే దక్కిందన్నారు. మరో సారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుని మరిన్ని సంక్షేమ పథకాలు అందుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం 250 మంది లబ్ధిదారులకు జగనన్న గృహాల రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పార్టీ నాయకులు కొణతాల మురళీకృష్ణ, కాండ్రేగుల యశ్వంత్, పలకా సత్యనారాయణ, కొండూరు రవీంద్రనాథ్, పార్టీ శ్రేణులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ



ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న స్వయం సహాయక సంఘాల మహిళలు

కశింకోట : మండలంలోని తేగాడ గ్రామంలో స్వయం సహాయక సంఘాల మహిళలు ఓటు హక్కుపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు తుంపాల మంగతాయారు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నీటిపల్లి లక్ష్మి, వెలుగు ఏపీఎం ఎస్. శ్రీనివాసరావు, సీసీ అనూరాధ, వీవోఏలు మంగ లక్ష్మి, చినపాప తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే సీఎం జగన్ లక్ష్యం

కశింకోట : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి ఆదుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సుమారు 200 మందికి నూతన ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వ హించారు. ఆరోగ్యశ్రీ పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచారన్నారు. దీనివల్ల దాదాపు అన్ని వ్యాధులకు, అందరికీ ఆరోగ్యం సమకూరడానికి అవకాశం కలుగుతుందన్నారు. ఈ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే వైఎస్సార్ జగనన్న కాలనీల్లో 220 మంది ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మంత్రి జయరజని, పంచాయతీ కార్యదర్శి కె. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జమాదులపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష


జమాదులపాలెంలో రోగుల పేర్లు నమోదు చేస్తున్న సిబ్బంది


రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు మణీషా

కశింకోట : మండలంలోని జమాదులపాలెం సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుమారు 386 మందికి వైద్య సేవలందించారు. వీరిలో 65 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 13 మందికి కంటి శస్త్ర చికిత్సలు, 33 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. ప్రత్యేక వైద్యాధికారులు నిహారిక, ఉమాదేవి, పీహెచ్‌సీ వైద్యాధికారి మణీషా కార్యక్రమానికి హాజరైన రోగులను తనిఖీ చేసి అవసరమైన వారికి బీపీ, సుగర్, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే ఆప్తాల్మిక్ సంధ్య కంటి పరీక్షలు జరిపి అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు, కళ్లద్దాల కోసం సిఫార్స్ చేశారు. శిబిరాన్ని ఎంపీపీ కలగా లక్ష్మి సందర్శించి అన్ని విభాగాలను పరిశీలించారు. కార్యక్రమాన్ని జిల్లా ప్రోగ్రాం అధికారి జగదీష్ పర్యవేక్షించారు. వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, సర్పంచ్ కరక రాజ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి కరక శేషు, ఎంపీటీసీ సభ్యురాలు గూడెపు లక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ నరసింహారావు, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

జీవో విడుదల శుభపరిణామం

అనకాపల్లి : వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఫార్మసిస్టులను, గ్రేడ్-2లను ఇక నుంచి ఫార్మసీ అధికారులుగా ప్రభుత్వం జీవో 44 విడుదల చేయడం శుభ పరిణామమని స్థానిక గొల్లవీధి యూపీహెచ్‌సీ ఫార్మసిస్ట్ ఆది సతీష్ కన్నా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ ఆస్పత్రులు, యూపీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో పని చేస్తున్న ఫార్మసిస్టులు, ఉద్యోగులకు ప్రభుత్వం భరోసా కల్పించిందన్నారు.

ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తులు

తుమ్మపాల: ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం చర్మకారులు, ఫ్లేయర్స్, వ్యర్థాలను సేకరించేవారు, మాన్యువల్ స్కావెంజర్స్ వంటి వృత్తుల్లో పని చేసే వారి పిల్లలు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి టి.అజయ్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈ పథకం కింద అన్ని రకాల విద్యాలయాల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదివే డేస్ స్కాలర్స్‌కు రూ.3 వేలు, మూడు నుంచి పదో తరగతి వరకు చదివే హాస్టళ్ల విద్యార్థులకు రూ.8 వేలు స్కాలర్ షిప్ మంజూరు చేస్తుందన్నారు. అర్హులైన విద్యార్థులు ఏప్రిల్ 10వ తేదీ లోపు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలను సచివాలయాల్లో తెలుసుకోవచ్చన్నారు.

ఫిజియోథెరపీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

తుమ్మపాల: జిల్లా సమగ్రశిక్ష పరిధిలో 21 భవితా కేంద్రాల్లో ఫిజియోథెరపీ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సమగ్ర శిక్ష అదనపు పథక సంచాలకులు, డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు సమగ్రశిక్ష జిల్లా కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఫిజియోథెరపీలో యూజీసీ గుర్తింపు కలిగిన డిగ్రీ, మాస్టర్ డిగ్రీ ఉండాలని, మార్కుల మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు.